


# హసన్ హబ్బాల్

ఒక దేశంలో తాళ్లు పేని జీవించేవాడొకడున్నాడు. వాడి పేరు 'హసన్'. తాళ్లు పేని అమ్మేవాణ్ణి 'హబ్బాల్' అని అంటారు కాబట్టి అందరూ వాణ్ణి 'హసన్ హబ్బాల్' అని పిలుస్తుండేవారు.

వాడు రోజూ ఉదయాన్నే రూపాయి తీసుకొని బజారుకు వెళ్లి నార కొనుక్కుంటాడు. దానితో పశువులకు ముక్కు తాళ్లు, పలుపుతాళ్లు పేనుతాడు. పేని వాటిని రెండు రూపాయలకు అమ్ముతాడు. లాభం ఒక్క రూపాయిని యింటి ఖర్చులకు వాడుకుంటాడు. పెట్టుబడి ఒక్క రూపాయిని మరుసటి రోజు కోసం దాచుకుంటాడు.

యిట్లా వాడు ముప్పయి ఏళ్లుగా బతుకుతున్నాడు. ఈ ముప్పయి ఏళ్లలో వాడి పెట్టుబడి పెరగలేదు. ఆదాయమూ పెరగలేదు. ఊళ్లో అందరికీ ఈ సంగతి తెలుసు.

ఏనాటి నుంచో యితడి వ్యవహారం గమనిస్తున్న యిద్దరు ధనవంతులకి ఈ విషయం మీద ఒకసారి చర్చ జరిగింది.

'చూశావా మిత్రమా హసన్ హబ్బాల్ జీవితం. ముప్పయి ఏళ్లుగా వాడు ఒక్కలాగే బతుకుతున్నాడంటే ఏమనుకోవాలి. తక్దీర్ (అదృష్టం) వాడి తలుపు తట్టలేదనే గదా' అన్నాడు మొదటి ధనవంతుడు.

'కాదు మిత్రమా. తక్బీర్ (కార్యసాధన) ఉంటే ఎవ్వరికీ అదృష్టంతో పనిలేదు. హసన్ హబ్బాల్ మంచి వృత్తి నైపుణ్యం ఉన్నవాడు. కానీ వాడికి కార్యసాధన లేదు. 'వ్యాపారాన్ని పెంచుకోవాలి. బాగా డబ్బు గడించాలి. పైకి రావాలి' అని అతను అనుకోవడం లేదు. అందుకని అలా ఉన్నాడు' అన్నాడు రెండవ ధనవంతుడు.

'నువ్వు చెప్పేది కరెక్టు కాదు మిత్రమా. బాగా సంపాదించాలి, పైకి రావాలి అని అనుకోని మనిషి ఉండడు. అందరూ అలా అనుకుంటారు. కార్యసాధనతో ప్రయత్నాలు చేస్తారు కూడా. అయితే అందరూ ఆ పనిలో సఫలం కాలేరు. హసన్ హబ్బాల్ లాంటి వాళ్లకి టైము కలిసి రావాలి. అదృష్టం తోడు నిలవాలి. అప్పుడే వాళ్లు పైకి వచ్చేది' అన్నాడు మొదటివాడు.

'చూద్దామా పందెం' అన్నాడు రెండవవాడు.

'సరే కానీ' అన్నాడు మొదటివాడు.

మరుసటి రోజు వాళ్లిద్దరూ హసన్ హబ్బాల్ దగ్గరకు వెళ్లారు.

కార్యసాధనను నమ్ముకున్న ధనవంతుడు ముందుకు వచ్చి 'ఓయ్ హసన్ హబ్బాల్. ఎంతకాలం యిలా గొర్రెతోక బతుకు బతుకుతావు. నేను నీకు కొంత డబ్బు యిస్తాను. దానితో నీ వ్యాపారాన్ని పెంచుకో. యింకొంత మంది మనుషుల్ని పెట్టుకొని పని చేయించు. బాగుపడు. మళ్లీ మేము రెండు నెలల తర్వాత వస్తాం' అని చెప్పి హసన్ హబ్బాల్‌కు తగినంత డబ్బు యిచ్చి స్నేహితుడితో పాటు వెళ్లిపోయాడు.

ఇది కలా నిజమా అర్థంకాని హసన్ హబ్బాల్ ఎంతో సంతోషంగా ఆ డబ్బు అందుకున్నాడు.

డబ్బు చేతిలో పడ్డాక అతడికి మాంసం గుర్తుకొచ్చింది.

'పాడుబతుకు ముప్పయి ఏళ్లుగా బతుకుతున్నాను. ఒక్కనాడు కూడా కడుపు నిండుగా మాంసం తినలేదు. ఇవాళ యింటికి మాంసం తీసుకెళదాం' అనుకొని కేజీ మాంసం కొనుక్కొని, నెత్తి మీద పెట్టుకొని, ఆ మాంసం కింద ధనవంతుడు యిచ్చిన డబ్బును కూడా పెట్టుకొని యింటికి బయలుదేరాడు.

దారిలో ఒక గద్ద ఆ మాంసాన్ని చూసి సర్ మంటూ వచ్చి తన్నుకుపోయింది. మాంసంతో పాటు డబ్బులు కూడా పోయాయి.

లబోదిబోమన్నాడు హసన్ హబ్బాల్.

రెండు నెలలు గడిచాయి.

ధనవంతులిద్దరూ హసన్ హబ్బాల్ దగ్గరకి వచ్చారు.

రెండు నెలల కిందట ఎలా ఉన్నాడో యిప్పుడూ అలాగే ఉన్నాడు హసన్ హబ్బాల్. రూపాయి పెట్టుబడి. రూపాయి ఆదాయం.

'చూశావా మిత్రమా. నేను చెబితే నువ్వు నమ్మలేదు. వీడికి అదృష్టం కలిసి రాదంతే' అన్నాడు అదృష్టాన్ని నమ్మిన ధనవంతుడు.

'కాదు. యితడు తెలియనితనంతో డబ్బు పోగొట్టుకున్నాడు. యితనికి యింకో అవకాశం యిస్తాను. కార్యసాధనతో కచ్చితంగా పైకివస్తాడు' అని మళ్లీ యింకొంచెం పైకం యిచ్చి 'రెండు నెలల తర్వాత మళ్లీ వస్తాం. ఈసారైనా జాగ్రత్తగా నీ వ్యాపారాన్ని పెంచుకో' అన్నాడు రెండో ధనవంతుడు.

హసన్ హబ్బాల్ చాలా జాగ్రత్తగా అందుకున్నాడు డబ్బుని.

ఈ సంగతి భార్యకు కూడా చెప్పకూడదు అనుకొని జాగ్రత్తగా తీసుకెళ్లి యింట్లోని తవుడుకుండలో దాచిపెట్టాడు.

ఆ రోజుల్లో గుర్రాలు ఉన్న వాళ్లు వీధుల్లో తిరుగుతూ తవుడు కొనుక్కొని వెళ్లేవాళ్లంట.

అలాంటి వాళ్లొచ్చి 'తవుడు కొంటాం. తవుడు కొంటాం' అని తిరుగుతూ ఉంటే హసన్ హబ్బాల్ భార్య వెళ్లి తవుడు కుండని వాళ్లకు అమ్మేసింది. తవుడుతో పాటు అందులోని డబ్బులూ పోయాయి.

మళ్లీ లబోదిబోమన్నాడు హసన్ హబ్బాల్.

రెండు నెలలు గడిచాయి.

మళ్లీ ధనవంతులిద్దరూ హసన్ హబ్బాల్ దగ్గరకు వచ్చారు. ముప్పయి ఏళ్లుగా ఎలా ఉన్నాడో యిప్పుడూ అలాగే ఉన్నాడతడు.

కార్యసాధనను నమ్మి రెండుసార్లు పెట్టుబడి యిచ్చిన ధనవంతుడు నిరాశపడ్డాడు.

'నిరాశపడకు మిత్రమా. నువ్వు రెండుసార్లు కార్యసాధనను నమ్ముకొని పెట్టుబడి పెట్టావు. ఈసారి నేను అదృష్టాన్ని నమ్ముకొని పెట్టుబడి పెడ్తాను. చూద్దాం ఏమవుతుందో' అని కేవలం రెండంటే రెండే అణాలు హసన్ హబ్బాల్‌కు యిచ్చి 'హసన్ హబ్బాల్. దీనితో నార కొనుక్కొని నీ వ్యాపారాన్ని పెంచుకో' అని వెళ్లిపోయాడు అదృష్టాన్ని నమ్ముకున్న ధనవంతుడు.

రెండు అణాలకు ఏమొస్తుంది? ఏమీ రాదు.

హసన్ హబ్బాల్ వాటిని తీసుకెళ్లి యింట్లోని గూట్లో పారేశాడు.

హసన్ హబ్బాల్ ఉంటున్నది ఒక బెస్తవాళ్ల యిలాఖా. ఆ బెస్తవాళ్లలో ఒకడు కటిక దరిద్రుడు ఉన్నాడు. వాడు ఆ రోజు చేపల వేటకు వెళుతూ ఉంటే వల చిరిగిపోయి కనిపించింది. కుట్టుకుందామంటే సూది లేదు.

భార్యని పిలిచి 'పెళ్లామా పెళ్లామా. ఎవరినైనా వెళ్లి రెండు అణాలు అప్పు అడిగి రా. సూది కొనుక్కొని వల కుట్టుకుందాం. వాళ్లు అప్పు యిచ్చినందుకు మారుగా మనం వలలో మొదటగా పడిన చేపని వాళ్లకు యిచ్చేద్దాం' అన్నాడు.

బెస్తవాడి భార్య ఎందరెందరి దగ్గరకో వెళ్లి రెండు అణాలు అప్పు అడిగింది. ఎవ్వరూ యివ్వలేదు.

చివరకు హసన్ హబ్బాల్ దగ్గరకు వచ్చింది.

'అదిగో ఆ గూట్లో రెండు అణాలు పడివున్నాయి. అవి నాకు అక్కరలేదు. తీసుకెళ్లు' అని యిచ్చి పంపేశాడు హసన్ హబ్బాల్.

మరుసటి రోజు బెస్తవాడు వచ్చి ఒక పెద్ద చేపను హసన్ హబ్బాల్‌కు యిచ్చాడు.

'నువ్వు యిచ్చిన రెండు అణాలతో సూది కొనుక్కుని వల కుట్టుకున్నాను. మొదటగా ఈ చేప పడింది. యిచ్చిపోదామని వచ్చాను' అన్నాడు.

సరే అని తీసుకెళ్లి దానిని భార్యకు యిచ్చాడు హసన్ హబ్బాల్.

కోసి చూస్తే ఏముంది? లోపల మిలమిలమని మెరిసిపోతున్న రాయి. ఆ రాయి వెలుగుకి హసన్ హబ్బాల్ గుడిసె మొత్తం కాంతితో వెలిగిపోయింది.

'మనం యింట్లో దీపానికి గతిలేని దరిద్రులం. అందుకని దేవుడు ఈ వెలుగురాయి యిచ్చినట్టున్నాడు' అనుకొని రాత్రిపూట దీపానికి మారుగా ఆ రాయిని గంపకింద ఉంచడం మొదలు పెట్టింది హసన్ హబ్బాల్ భార్య.

కొన్నాళ్లకు ధనవంతుల యిలాఖాలోని ఒక ధనవంతుడు రాత్రి పూట మేడ మీద నిలబడి హబ్బాల్ గుడిసెలో నుంచి వస్తున్న కాంతిని గమనించాడు.

'యిదేమిటి? ఈ కాంతి చాలా వింతగా ఉంది' అనుకొని హబ్బాల్ యింటికి వచ్చి చూశాడు.

చూస్తే, యింట్లో అంతులేని విలువైన వజ్రం.

వెంటనే హసన్ హబ్బాల్ కుటుంబాన్ని కూర్చోబెట్టి 'అమ్మా. దీనికి విలువ కట్టేవాళ్లు ఎవరూ లేరు. మీరు ఎంత అడిగితే అంత యిస్తాను. నాకు యిచ్చెయ్యండి' అని బతిమిలాడాడు.

హసన్ హబ్బాల్ అప్పుడు తాను కోరినంత డబ్బు, బంగారం, వెండి అడిగాడు. అన్నీ యిచ్చాడు ధనవంతుడు.

అలా రెండు అణాల పెట్టుబడితో అదృష్టం కలిసొచ్చి హసన్ హబ్బాల్ ధనవంతుడయ్యాడు. ఆ తర్వాత వ్యాపారాన్ని పెంచుకొని ఎందరికో ఉద్యోగాలు యిచ్చాడు.